# పెద్దవారి కొరకైన కథ

## (2 సమూ. 24; 1 దినవృ. 21)

"పెద్దవారి కొరకైన కథ" అని ఈ పాఠానికి పేరు పెట్టబడింది, అయితే పడక సమయపు కథగా యిది ఉద్దేశింపబడలేదు. నీవు మేల్కొనియుండాలని కోరుతున్నాను! మన కథ 2 సమూ. 24లో ఉంది. 1 దినవృ. 21లో యిది తిరిగి చెప్పబడడంతో యింకా కొన్ని వివరాలు చేర్చబడ్డాయి.

రోమా 15:4 యిలా అంటుంది: "ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగు నిమిత్తము వ్రాయబడియున్నవి." పాత నిబంధనలో వ్రాయబడినవి మనకై చేయబడిన చట్టాలు కావు. అయితే వాటికి ప్రత్యేకమైన విలువ ఉంది. (1) అవి మనకు "బోధ కలుగు నిమిత్తం వ్రాయబడ్డాయి." పాత నిబంధనలో ఎక్కువ భాగం గురితో చేయబడిన సంపూర్ణ ఉపదేశం కాదు. అవి కథారూపాలు వాటిలోనుండి పాఠాలు నేర్చుకోవాలని దేవుడు కోరుతున్నాడు. (2) "ఓర్పు," సహనం కలిగియుండాలని అవి మనకు నేర్పుతాయి. (3) అవి మనకు ఆదరణ, "ప్రోత్సాహాన్ని" యిస్తాయి. (4) అవి మనకు "నిరీక్షణను" కలిగిస్తాయి, మన ఆత్మలకు లంగరుగా ఉంటాయి. 2 సమూ. 24, మరియు 1 దినవృ. 21లోని కథను ఉపయోగించుకొని, ఏడు సత్యాలను మనం ఆలోచన చేద్దాం.

### పెద్దవారు సయితం పాపం చేయగలరు

### (2 సమూ. 24:1-10; 1 దినవృ. 21:1-8)

"ఒకానొకప్పుడు" అని అనేక కథలు ప్రారంభమౌతాయి. ఆ సూత్రాన్ని తీసికొని, "ఒకానొకప్పుడు రాజైన దావీదు జనాభా లెక్కలు తీయ నిర్ణయించుకున్నాడు" అంటూ ప్రారంభిద్దాం. బైబిలు యిలా అంటుంది: "అందుకు రాజు తన యొద్దనున్న సైన్యాధిపతియైన యోవాబును పిలిచి – జనసంఖ్య యెంతైనది నాకు తెలియగలందులకై దాను మొదలుకొని బెయేర్షెబావరకు ఇశ్రాయేలు గోత్రములలో నీవు సంచారముచేసి వారిని లెక్కించుమని ఆజ్ఞ ఇయ్యగా" (2 సమూ. 24:2). దావీదు యొక్క జీవితానికిని, పరిపాలనకును చివరి కాలంలో యిది జరిగింది. ఈ వృద్ధుడు జనాభా లెక్కలు తీయాలని తీర్మానించుకున్నాడు, అలా చేయడంలో అతడు పాపం చేశాడు.

ఈ కార్యం ఎందుకు పాపమయ్యిందో స్పష్టంగా తెలియదు. ఇతర సమయాల్లో, దేవుడు జనాభా లెక్కలకు ఆజ్ఞాపించాడు, అయితే ఈసారి మాత్రం, ఏదో యొక కారణాన్నిబట్టి, దేవుడు దానికి యిష్టపడలేదు. దావీదుకు సైన్యాధిపతియైన యోవాబైతే, దావీదు తన అహంభావపు పంథాలో పోతున్నట్టు తలంచి, దీని విషయంలో రాజుతో

మాట్లాడాడు: "జనుల సంఖ్య యెంతయున్నను నా యేలినవాడవును రాజువునగు నీవు బ్రదికియుండగానే దేవుడైన యెహోవా దానిని నూరంతలు ఎక్కువ చేయును గాక; నా యేలినవాడవును రాజువునగు నీకు ఈ కోరిక ఏలపుట్టెను" అని యోవాబు అన్నాడు (2 సమూ. 24:3).[1] లెక్కించింది యుద్ధం చేసేవారేయన్నట్టు గోచరిస్తుంది: "అప్పుడు యోవాబు జనసంఖ్య వెరసి రాజునకు అప్పగించెను; ఇశ్రాయేలువారిలో కత్తి దూయగల యెనిమిది లక్షల మంది యోధులుండిరి; యూదావారిలో అయిదు లక్షలమంది యుండిరి" (2 సమూ. 24:9). ముందటి జనాభా లెక్కలవలె, ఇది ప్రజలను పొందిక పరచడానికి గాని, మత పరమైన కార్యకలాపాల కొరకు గాని కాదు. ఇది కేవలం సైనిక ఉద్దేశం కొరకే.

ఇది పాపమైయుండడానికి శ్రేష్ఠమైన ఊహ ఏమంటే – దేవుని మీద ఆనుకొనడం కంటె, దావీదు కండబలం మీద ఆనుకొన జూడటమైయుండవచ్చు. దావీదు గొల్యాతు మీదికి కేవలం ఒడిసెలతోనే వెళ్లినప్పుడు, కండబలం అతనికి ప్రాముఖ్యత లేనిదైయుంది. అమాలేకీయుల సైన్యాన్ని ఎదుర్కొనడానికి అతడు కేవలం నాలుగు వందల మందితో వెళ్లినప్పుడు,[2] అంగబలం అతనికి ప్రాముఖ్యత లేనట్టు కన్పించింది. దేవుని యొక్క ప్రసన్నత ఏమాత్రం చాలదన్నట్టు తోచినట్టుంది. ఎంతమంది సైనికులను తాను యుద్ధానికి పంపగలడో తాను ఎరుగగోరుతున్నాడు.

ఇది ఎందుకు పాపమో అనేది మనం ఎప్పుడైనా తెలిసికోగలమో లేదో కాని, అది పాపమని మాత్రం మనకు తెలుసు. 1 దినవృ. 21:1 దీనికి మరొక విషయం జత చేస్తుంది: "తరువాత సాతాను ఇశ్రాయేలీయులకు విరోధముగా లేచి, ఇశ్రాయేలీయులను లెక్కించుటకు దావీదును ప్రేరేపింపగా ..." దేవుడు దానిని జరుగనిచ్చాడు (2 సమూ. 24:1), కాని ప్రేరేపించినవాడు సాతాను.[3] "ఈ కార్యము దేవునికి ప్రతికూలమయ్యిందని 7వ వచనం సూచిస్తుంది. పైగా, ఆ జనాభా లెక్కలు తీసిన తరువాత తాను పాపం చేసెననడానికి అతని మనస్సులోనే సందేహం పుట్టలేదు. "జనసంఖ్య చూచినందుకై దావీదు మనస్సు కొట్టుకొనగా అతడు – నేను చేసిన పనివలన గొప్ప పాపము కట్టుకొంటిని" అని అన్నాడు (2 సమూ. 24:10ఎ).

ఎదిగినవారు యింకా పాపం చేయగలరు. ఎదిగినవారు శోధింపబడవచ్చు, అపవాదిచే మోసగింపబడవచ్చు.

పాపము యిక ఎన్నటికి సమస్య కాదు అనే స్థితికి చేరుకోవాలని ఆశించడం మంచిదే, జీవితంలో మనం ఎంతో జ్ఞానంగాను పరిపక్వంగాను ఎదిగి పాపం విషయమై మరచిపోవచ్చుననుకొనడం బాగానే ఉంటుంది; కాని అది అలా జరుగదు. యోబు 32:9లో ఒక గంభీరమైన ఆలోచన ఉంది: "వృద్ధులు మాత్రమే జ్ఞానవంతులు కారు బహు వయస్సుగలవారు ఒకప్పుడు న్యాయము తెలిసినవారు కారు."

సాతాను యొక్క అగ్ని బాణాలకు భయము లేకుండేవారు ఎవరైనా ఉండగలరంటే – అది దావీదు అయ్యుండాలి. అతడు యింకను "దేవుని హృదయానుసారుడైన" మనిషి. బత్షెబ సందర్భంలో భయంకరమైన బాధలనుభవించి బయటపడినవాడు; వ్యక్తిగతమైన భక్తిలో బలిష్టుడు. అయినా, అతడు కూడా భద్రతగలవాడు కాదు. దావీదు అంతంవరకు

నమ్మకంగా నిలిచినవాడు, అయితే అతడు కూడా అంతంవరకు పొరపాటు చేసిన వాడుగనే ఉండిపోయాడు.

శోధన విషయమై జాగ్రత్తగా ఉండమని మనం యౌవనులను హెచ్చరించుతాం, వారు పడిపోవడం ఎంత సులభమో మనం గుర్తిస్తాం. మనం వృద్ధులమయ్యేకొలది మనం యింకా శోధింపబడదగిన వారంగానే ఉంటాం. మనం యువకులమైనప్పటికంటె భిన్నంగా ఉండవచ్చునేమో గాని, మనం శోధింపబడదగినవారంగానే ఉంటాం. దావీదు ముసలివాడైనప్పుడు, తన హృదయపు కామాతురతచే పడిపోయేలా చేయలేదు, తన హృదయపు గర్వంవలన అతనిని పడిపోయేలా చేసింది. దేశానికి సంబంధించి, వచ్చిన ఫలితం యింకను ఘోరమయ్యిందే.

వృద్ధులమైన మనం శోధనకు అతీతులం కాము అన్న విషయాన్ని గమనించాలి. ఒక నిర్ణీతమైన వయస్సులో మనం కొన్ని పన్నుల మినహాయింపు పొందవచ్చునేమో కాని, పాపంనుండి మనం ఎన్నడు మినహాయింపబడినవారం కాదు. "తాను నిలుచు చున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను" అనేది యింకను సత్యమే (1 కొరింథీ. 10:12). "మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు" (1 పేతురు 5:8) అనేది యింకా నిజమే. నీవు కొంత వయస్సు దాటుకొని వచ్చావు గనుక అపవాది నీ పేరును నీ అడ్రస్సును మరచిపోయాడు సరిగదా, నీ బలహీనతను సహా మరచిపోయాడు (యాకోబు 1:14). పైగా, "పాపమువలన వచ్చు జీతము మరణము" అనేది యింకను సత్యమే (రోమా 6:23). కొద్ది నెలల్లో నేను సీనియర్ సిటిజన్ డిస్కౌంట్లకు పాత్రుడనౌతాను, అయితే పాపానికి అలాటి డిస్కౌంట్లు ఏవీ ఉండవు. పాపానికి జీతం అందరికి ఒక్కటే.

## పెద్దవారు మృధువైన మనస్సాక్షిని నిలబెట్టుకోవాలి (2 సమూ. 24:10; 1 దినవృ. 21:7, 8)

2 సమూ. 24లో పలు గొప్ప లేఖన భాగాలు ఉన్నాయి. వాటిలో 10వ వచనం ఒకటి. "దేవుని హృదయానుసారుడని" దావీదు ఎందుకు పిలువబడ్డాడో మరల ఈ వచనం చూపుతోంది. "జనసంఖ్య చూచినందుకై దావీదు మనస్సు కొట్టుకొనగా అతడు – నేను చేసిన పనివలన గొప్ప పాపము కట్టుకొంటిని, నేను ఎంతో అవివేకినై దాని చేసితిని; యెహోవా కరుణయుంచి నీ దాసుడనైన నా దోషమును పరిహరింపుమని యెహోవాతో మనవి చేయగా ..."

జనాబా లెక్క దాదాపుగా ముగించబడింది. బెన్యామీను, లేవీయ గోత్రాలు మాత్రం లెక్కింపబడలేదు.[4] యోవాబు రాజునకు వాస్తవాలు, అంకెలు సమర్పించాడు. తొమ్మిది నెలలు సేకరించడానికి జమచేయడానికి పట్టిన రిపోర్టు దావీదునొద్ద పడియుంది. దావీదు దాన్ని చదివాడు, పడకకు వెళ్లాడు. అయినా, అతనికి నిద్ర పట్టలేదు. లోపల అతనిలో కలిత్రిప్పుడు జరుగుతుంది. తప్పేమి? అతని మనస్సాక్షి అతని వేదిస్తుంది. లేదు అలాగంటే సరిపోదు. అతని మనస్సాక్షి అతనిని ముక్కలు చేస్తుంది. అతని "మనస్సు **కొట్టు కొనగా**"

అని మన లేఖన భాగం అంది. KJVలో "తన హృదయం అతన్ని **కొట్టింది**"అని ఉంది.[5]

దావీదు పరిపూర్ణుడు కాదు. మనకందరికి ఉన్నట్టే అతనికి తన బలహీనతలున్నాయి. అతనికి తన మనస్సాక్షి కూడా ఉంది. తాను ఒక తప్పు చేసినప్పుడు దేవునికి బహు సమీపంగా వచ్చేవాడు, అతని మనస్సాక్షి అతన్ని ఒంటరిగా విడిచిపెట్టలేదు.

దేవుడు నరునికి ప్రసాదించిన ప్రత్యేకమైన వరము మనస్సాక్షి, తప్పు ఉంది, తప్పు లేదు అని చెప్పే అంతరంగపు తెలివి, తప్పు అని మనకు తెలిసింది చేసినప్పుడు, దోష భరితంగా మనం ఫీలయ్యేలా చేసేది, తప్పును తప్పని లోలోపల ఒప్పించేది.

మనస్సాక్షిని అలక్ష్యపెట్టడానికి నేడు జనులు ధైర్యం తెచ్చుకొంటున్నారు – తప్పు ఒప్పులనేవి పాత కాలపు భావాలని వారు తలంచుతున్నారు. సామాజిక ప్రమాణాలు, దేవుని చట్టాలను అతిక్రమించినప్పుడు మంచి కానట్టు ఫీల్ కాకూడదని వేరుగా ఉపదేశింప బడుచున్నారు. దోషమనే భావనను వారు ప్రత్యేకంగా ఎదిరిస్తున్నారు. "దోష భరితమైన ప్రమాణాలకు ప్రజలను పంపవద్దని" సువార్తికులు ఖండించబడుతున్నారు.

మనస్సాక్షిని ప్రసాదించడంలో దేవునికి ఉద్దేశముంది. మన స్వప్రయోజనమునకే మనలో ప్రతి ఒక్కనియందు మనస్సాక్షి ఉంచబడింది – పాపం చేయకుండ నిరుత్సాహ పరచడానికి, మరియు మనం పాపం చేసినప్పుడు దోషులమనే భావనచేత నింపబడి దేవుని కనికరము క్షమాపణ కొరకు దేవునియొద్దకు మళ్లుటకు ఉద్దేశింపబడింది. మనస్సాక్షి దాని పని చేయవలసియున్నట్టయితే, అది సున్నితంగాను, మృదువుగాను, తాకబడునది గాను ఉండిపోవాలి.

నేను ఎరిగిన అనేకమంది యువకులకు ఆలాటి మనస్సాక్షి ఉంది. లోకంతో పోర్లుతూ, మానవ దైవ చట్టాలను అతిక్రమించుతూ తిరుగుతున్నా, సరియైన పరిస్థితులలో, తమ పాపముయొక్క ఘోరమైన వాస్తవంచేత వారు తాకబడుతూ ఉంటారు. ఆహ్వానపు సమయంలో యువకులు తమ చెక్కిళ్లమీద కారుతున్న కన్నీళ్లతో ముందుకు వచ్చినవారిని నేను తరచుగా చూచాను.

వయస్సులో మనం ఎదిగేకొలది, మనం జాగ్రత్తగా ఉండకపోతే, మన మనస్సాక్షి దానికున్న మృదుత్వాన్ని కోల్పోయే అవకాశముంది. మనం ఎక్కువ నాగరికులం, ఎక్కువ లోక జ్ఞానులమయ్యే ప్రమాదం ఉంది. సమర్థించుకొనడంలో నైపుణ్యం సంపాదిస్తాం. జీవితంలో తేటైన నలుపు తెలుపు భాగాలను వేరుచేసే దానికి బదులు, మన కండ్లకు అంతా బూడిద రంగులా కన్పిస్తుంది. క్లుప్తంగా చెప్పాలంటే, మన మనస్సాక్షి వాతవేయబడుతుంది లేదా కఠినమైపోతుంది (1 తిమోతి 4:2). నీకు అది సందేహమా? పోయిన సంవత్సరం లోబడినవారు, పాపాలను ఒప్పుకున్నవారు, ప్రార్థనలు కోరినవారిని గూర్చి ఆలోచించు. వారిలో ఎందరు ముప్పై ఏండ్ల క్రిందివారు, ఎందరు ముప్పై ఏండ్లు పైబడినవారు? మనం వయస్సులో ఎదిగే కొలది మన మనస్సాక్షికి ఏదైనా సంభవించ వచ్చు.

దావీదు అలాటివాడు కాదు. అతని మనస్సాక్షి యింకను మృదువుగానే ఉండి పోయింది.

## పెద్దవారు తమ కార్యముల ప్రభావాన్ని గూర్చి గుర్తించాలి

## (2 సమూ. 24:11-15; 1 దినవృ. 21:9-14)

పెద్దవారికి అవసరమైన మూడవ గంభీరమైన సత్యం. మేలుకుగాని కీడుకుగాని మనలో ప్రతి ఒక్కరికి యితరుల మీద తన ప్రభావముంటుందని ప్రభువైన యేసు నొక్కి చెప్పాడు (మత్తయి 5:13-16). నవ యౌవనులకు దీన్ని మనం నొక్కి చెప్తుతాం. యువకులు మంచి మాదిరులుగా ఉండాలని పౌలు తిమోతికి చెప్పాడు (1 తిమోతి 4:12). "ఇది నామీదనే ప్రభావం కనుపరచుతోంది" అంటూ ఎందరు యువకులు తమ తల్లిదండ్రుల హృదయాలను పగులగొట్టారు, యింకా యితర యువకులను పాపంలోనికి నడిపించారో? ఈ సంగతి తెలిసికోవలసింది కేవలం నవ యువకులు మాత్రమే కాదు. ఈ గంభీరమైన సత్యాన్ని పెద్దవారమైన మనం కూడా గుర్తించాలి. దేవునినుండి మనం దూరమయ్యామంటే - ఎంత ఎక్కువ కాలం బ్రదుకుతామో అంత ఎక్కువ మందికి మనం కీడు చేస్తాం. దావీదు పాప ఫలితంగా వచ్చిన దానికంటె మరి శ్రేష్ఠమైన ఉదాహరణ దీనికి మరొకటి లేదు. 2 సమూ. 24:13నుండి ఉన్న వచనాలలో ఈ సంగతి వివరించబడింది.

మన కథలో దావీదు తన పాపాన్ని ఒప్పుకొని క్షమించుమని అతడు దేవుని వేడుకున్నాడు. అది బహు ఉత్తమమైనదే. అయితే దావీదు యొక్క జీవితాన్ని మనం క్రమబద్ధంగా చదువుకొంటూ వస్తున్నప్పుడు, పాప దోషము తొలిగింపబడినప్పటికీ, పాప ఫలితాలు యింకా పచారులు కొడుతునే ఉన్నట్టు కన్పిస్తాయి. క్షమాపణ జరిగినప్పటికిని - "మనుష్యుడు ఏమి విత్తునో ఆ పంటనే కోయును."

నేను టెక్సాస్‌ను విడువక ముందు దీనికి ఒక స్పష్టమైన ఉదాహరణను చూచాను. వారి సీనియర్ ప్రయాణంలో హైస్కూలు విద్యార్థి బృందం మత్తు పానీయం సేవించిన ఉదాంతం వార్తల్లో వచ్చింది. వారు తాము చేసింది ఒప్పుకొన్న తరువాత, వారి సీనియర్ సంవత్సరంలో మిగిలిన కొద్ది వారాలు వారు ఒంటరితనంగా చదువవలసి వచ్చింది. "వారు ఒప్పుకున్నారు; అది వారి రికార్డును ఏమీ లేకుండ తేటపరచవలసింది. వారికి ఏ శిక్షావిధి లేకుండా పోవలసియుందని!" జనంనుండి ఆందోళన వచ్చింది. అవును, విద్యార్థులు ఒప్పుకున్నారు - దానికి వారు అభినందింపబడాలి - వాటికి ఫలితాలు ఏమైయుంటాయో ముందుగా ఎరిగియు, వారు స్పష్టంగా ఎరిగియున్న చట్టాన్ని అతిక్రమించారు. ఒప్పుకొనడం ఫలితాలను తుడిచివేయదు.

ఈ సత్యాన్ని మనం గ్రహించాలి! ఒక డ్రింక్, ఒక విచక్షణ లేమి, హోటల్ రూమ్‌లో ముప్పై నిమిషాలు - దాని ఫలితాలు జీవిత కాలమంతా పచారులు కొట్టుతునే ఉండవచ్చు!

సూపర్ మార్కెట్టులోని బీరువాలోని టిన్నులలో ఒకదానిని తక్కిన టిన్నులకు తగులకుండ తియ్యడం ఎట్టిదో పాపం కూడా అట్టిదేనని అనేకులు ఆలోచిస్తారు. అలా కాదు. టిన్నులు చిన్నవి ఒక దానిమీద మరి యొకటి క్రమంగా పేర్చిన తరువాత, వాటిలో అడుగున కీలకమైన ఒకదాన్ని తీస్తే తక్కినవన్నీ ఎలా కూలిపోతాయో ఊహించు. పాపం యొక్క ప్రభావం అలాటిది.

2 సమూ. 24లో ఈ సత్యం ఉదహరించబడిన చోటుకి వద్దాం. మధ్య రాత్రి దావీదు తన పాపాన్ని ఒప్పుకొనడాన్ని దేవుడు విన్నాడు. మరుసటి ఉదయాన దేవుడు ప్రవక్తయైన గాదును దావీదు నొద్దకు పంపాడు (11, 12ఎ వ.). నలభై సంవత్సరాలకు ముందు అరణ్యంలో దావీదునొద్దకు గాదు వచ్చిన సంగతి నీకు జ్ఞాపకం ఉండి యుండవచ్చు. గాదు దావీదుకు ఆత్మ సంబంధమైన సలహాదారుడుగా ఉన్నాడు.[6] వృద్ధుడైయున్నా, రాజు యొక్క దేవుని సలహాదారులలో గాదు ఒకడుగా నిలిచిపోయాడు.[7]

దైవ సందేశంతో గాదు దావీదునొద్దకు, తన బిడ్డను క్రమశిక్షణలో ఉంచుకునే ప్రేమగల తండ్రిలా వచ్చాడు. దావీదు యొక్కయు – దేశం యొక్కయు చివరి మేలుకొరకు అతడు వచ్చాడు. వాస్తవంగా, అతడు దావీదుకు యిలాటి భావననిచ్చాడు: “నీ ఔషధం తీసికో. నీ పాఠం నీవు నేర్చుకో. అప్పుడు జీవితంలో సాగిపో.” మనం ముందుగా చూచినట్టే, దేవుడు తన పిల్లలను శిక్షిస్తాడు (హెబ్రీ. 12:4–13).

ఇక్కడి అసాధారణమైన పరిస్థితి ఏమంటే, ఏ దండంతో తాను శిక్షింపబడడానికి యిష్టపడతాడో, దానిని తానే కోరుకోవలసినదిగా దేవుడు అతనికి అవకాశమిస్తాడు. గాదు దావీదుతో యిలా చెప్పాడు: “యెహోవా సెలవిచ్చునదేమనగా – మూడు విషయములను నీ యెదుట పెట్టుచున్నాను; వాటిలో ఒక దానిని నీవు కోరుకొనినయెడల నేనది నీమీదికి రప్పించెదను” (2 సమూ. 24:12బి). ఒకవేళ నీవు చిన్న బిడ్డగా ఉన్నప్పుడు, మీ ఉపాధ్యాయుడు శిక్షింపబడే విధానాన్ని కోరుకోమని నీకు అవకాశం యిచ్చాడు: “ఒక వారం దాకా స్కూలు అయిపోయిన తరువాత ఒక గంట ఎక్కువసేపు అక్కడే ఉండాలి ... లేదా ఒక డజన్ దెబ్బలు తినాలి అన్నట్టు.” దావీదుకు ఈ అవకాశాలలో ఒకదాన్ని కోరుకోమన్నాడు.

> గాదు దావీదు నొద్దకు వచ్చి యిట్లనెను – మూడేండ్లపాటు కరవు కలుగుట, మూడు నెలలపాటు నీ శత్రువులు కత్తిదూసి నిన్ను తరుమగా నీవు వారియెదుట నిలువలేక నశించిపోవుట, మూడు దినములపాటు దేశమందు యెహోవా కత్తి, అనగా తెగులు నిలుచుటచేత యెహోవా దూత ఇశ్రాయేలీయుల దేశమందంతట నాశనము కలుగజేయుట, అను వీటిలో ఒకదానిని నీవు కోరుకొనుమని యెహోవా సెలవిచ్చు చున్నాడు ... (1 దినవృ. 21:11, 12).

ఈ మూడింటిలో ఒకటి మాత్రం కామన్‌గా ఉంది. అన్నీ దావీదు యొక్క పాపపు కేంద్రం మీదనే కొట్టతాయి. అన్నియు యుద్ధం చేయగలవారి సంఖ్యనే తగ్గిస్తాయి.

“అందుకు దావీదు – నేను మిక్కిలి యిరుకులో చిక్కియున్నాను” అని గాదుతో అన్నాడు (2 సమూ. 24:14ఎ). దావీదు పాపమును బట్టి, అనేకమంది ప్రజలు చనిపోబోతున్నారు! మింగడానికి అది బహు చేదైన మాత్రయైయుంది.

దావీదు తెగులును కోరుకున్నాడు. ప్రజలందరు ఎలాగో ఆలాగే తానుకూడా వెలుతురుకు పడవేయనొల్లపడేది అది ఒక్కటే. (అంటే తెగులుకు ప్రజలెంత గురి కాగలరో తాను కూడా అంతే గురికాగలడు) అయినా, ఈలాటి తన నిర్ణయానికి బైబిలు హేతువు నిస్తుంది: “యెహోవా మహా కృపగలవాడు, నేను మనుష్యుల చేతిలో పడక ఆయన

చేతిలోనే పడుదును గాక" అని గాదుతో అన్నాడు (2 సమూ. 24:14బి). నీకు ఈలాటి అవకాశం ఎప్పుడైనా వస్తే, మనుష్యుల చేతుల్లో పడేదానికంటె దేవుని చేతుల్లో పడడానికి కోరుకో. దేవుడు న్యాయవంతుడు; దేవుడు ఏమి చేసిన మన మేలుకే; మరియు అది ముగిసిన తరువాత, దేవుడు క్షమిస్తాడు. మరోవైపు నరులు క్రూరులైయుండవచ్చు. నరుడు తనకు యిష్టం వచ్చినదానిని జరిగిస్తాడు – పైగా నిరంతరం పగకూడా పెట్టుకోవచ్చు.

"అందుకు యెహోవా ఇశ్రాయేలీయులమీదికి తెగులు రప్పించగా ఆ దినము ఉదయము మొదలుకొని సమాజ కూటపు వేళవరకు అది జరుగుచుండెను; అందుచేత దానునుండి బెయేర్షెబావరకు డెబ్బదివేల మంది మృతినొందిరి" (2 సమూ. 24:15). "దానునుండి బెయేర్షెబా" అనే ప్రాంతంలోనే జనాభా లెక్కలు తీయబడింది (2 సమూ. 24:2). అంతమందిని అంత త్వరలో చంపిన తెగులు ఎలాటిదో నేను ఊహించలేను. ఆ రిపోర్టు రాగా దావీదు హృదయంలో ఆవేదన ఎంతగా ఉందో నీవు ఊహించలేవా? "డెబ్బదివేలమంది పురుషులు ... చనిపోయారు" – స్త్రీలు కాదు, కేవలం పురుషులే. వీరు దాదాపుగా యుద్ధం చేసే వయస్కులు అయ్యుండవచ్చు. ఎవరి విషయంలో దావీదు అంత అతిశయంగా ఉన్నాడో ఆ మనుష్యులే.

ఒక మనిషి యొక్క పాపం ఎంత విస్తృతమైన లేక విపరీతమైన పరిణామాలను తెస్తుందో అనే దానికి యిది మనస్సును వేదించే ఉదాహరణయైయుంది.

అవును పెద్దవారు పాపం చేయగలరు. కొందరికి మధ్య వయస్సు వెర్రి చేష్టలుంటాయి. కొందరు బాధ్యతా రహితమైన పసితనంలోనికి ఉద్దేశపూర్వకంగానే వెళ్లతారు. బాధ్యతా రహితులుగా పనిచేసినప్పుడు బాధింపబడే జీవితాలను చూచేలా దేవుడు మనకు సహాయం చేయునుగాక. "డెబ్బదివేల మంది" చనిపోకపోవచ్చు. కాని మనం ప్రేమను చంపివేయ వచ్చు. హృదయాలను పగులగొట్టవచ్చు, విశ్వాసాన్ని నాశనం చేయవచ్చు, విశ్వాసులకు భ్రమ కలిగించవచ్చు, దేవునినుండి తొలిగి కొందరిని నశించిపోయేలా చేయవచ్చు.

తమ సొంత కార్యముల యొక్క ప్రభావం ఎలాటిదైయుంటుందో పెద్దవారు గమనించాలి.

## తమ చర్యలకు పెద్దవారు పూర్ణ బాధ్యతను అంగీకరించాలి (2 సమూ. 24:16, 17; 1 దినవృ. 21:15-17)

అనుభవం లేనివారు తమకు సంభవించినవాటికి యితరులను నిందిస్తారు. "ఎవరో ఒకరు తన్ను మోసం చేశారు. ఒకరు నన్ను తప్పించాడు. అలా జరిగినట్టయితే, లేక యిలా జరిగినట్టయితే, నేను ఈ దురావస్థలో లేకుండా ఉండేవాడనే" అని అనుకొనడం జరుగుతూ ఉంటుంది. అనుభవజ్ఞులైతే, – అంటే ఎదిగినవారైతే – ఏ విధమైన సాకులు చెప్పకుండ "అది నా తప్పు" అని ఒప్పుకుంటారు.

తిరిగి మనం మన కథ దగ్గరకు వెళ్లదాం.

> అయితే దూత యెరూషలేము పైని హస్తము చాపి నాశనము చేయబోయినప్పుడు, యెహోవా ఆ కీడునుగూర్చి సంతాపమొంది – అంతే చాలును, నీ చెయ్యి తీయుమని జనులను

నాశనము చేయు దూతకు ఆజ్ఞ ఇచ్చెను (2 సమూ. 24:16).

అసలు మూలంలో శిక్షించు విషయంలో, "యెహోవా పశ్చాత్తాపపడెను" అని ఉందట. ఆయన మనస్సు త్రిప్పుకున్నాడని అర్థం. మనుష్యుని మారుమనస్సుపై దేవుడు తన మనస్సు త్రిప్పుకొనడం ఆధారపడియుంటుంది. 1 దినవృ. 21:16 గమనించు – దావీదును ప్రజల పెద్దలును మారుమనస్సుకు గుర్తుగా "గోనెపట్ట ధరించుకున్నారు."

"దావీదు జనులను నాశనము చేసిన దూతను కనుగొని యెహోవాను ఈలాగు ప్రార్థించెను" (2 సమూ. 24:17ఎ). 1 దినవృ. 21:16 యిలా అంటుంది: "దావీదు కన్నులెత్తి చూడగా, భూమ్యాకాశముల మధ్యను నిలుచుచు, వరదీసిన కత్తి చేతపట్టుకొని దానిని యెరూషలేము మీద చాపిన యెహోవా దూత కనబడెను." "– చిత్తగించుము; పాపము చేసినవాడను నేనే; దుర్మార్గముగా ప్రవర్తించినవాడను నేనే; గొఱ్ఱెలవంటి వీరేమి చేసిరి? నన్నును నా తండ్రి యింటివారిని శిక్షించుము" అని దావీదు చెప్పాడు (2 సమూ. 24:17బి). ఈ గొప్ప ఒప్పుకోలు అంతా 10వ వచనంతో వెళ్లుతుంది. "నేను మాత్రమే నిందితుడను" అని దావీదు చెప్పుతూ, "గొర్రెలు" అని దావీదు తన జనులను గూర్చి చెప్పుతున్నాడు. వారికి అతడే బాధ్యుడు. ప్రజలు పరిపూర్ణులని దాని అర్థం కాదు. 2 సమూ. 24:1 చూడు. ప్రజలు దేవునికి కోపం పుట్టించారు.[8] ఆ తెగులు దావీదుకు మాత్రమే గాక దేశమంతటికి శిక్షగా అనుగ్రహింపబడినట్టుంది. ఆ తెగులును పుట్టించ డమనే ప్రత్యేకమైన పాపానికి జనులు బాధ్యులు కారని దావీదు భావం.

నేటివలె, ఆ రోజుల్లో కూడా, తమ నాయకుని కాపాడడానికి గాను, నిందను "తమపై వేసికొనేవారు" ఉన్నారు. అయితే దావీదు ఆలాటి రాజరికపు అనుకూలతను దేనిని ఉపయోగించుకోలేదు. ఆ నిందను అతడు ఎవినిమీదను వేయలేదు. అతడు ప్రజలను నిందించలేదు. అతని సలహాదారులను నిందించలేదు. అతడు సాతానును సహా నిందించలేదు. ("అపవాది నన్ను యిలా చేయించాడు" అని అనలేదు). అతడు దేవుని కూడా నిందించలేదు ("నన్ను శోధించేలా సాతానుకు నీవు అనుమతి నిచ్చావు" అని అనలేదు). 10వ వచనంలో అతడు చేసినట్టే, "నేను ... పాపం చేశాను" అని అతడు తిరిగి అన్నాడు.

దీనికంటె కష్టమయ్యింది మరేదీలేదు. "నేను దాన్ని చేశాను. బాగా ఎరుగగలిగినంత వయస్సు నాకు ఉంది. నేను దేవుని వాక్యాన్ని చదివాను. ఏది తప్పో ఏది ఒప్పో నాకు తెలుసు. నన్ను తప్ప నేను వేరెవరిని నిందించబోను. నేను పాపం చేశాను, ఘోరంగా పాపం చేశాను. నేను బుద్ధిహీనునిగా ప్రవర్తించాను" అని చెప్పడం బహు కష్టం. తమ చర్యలకు పూర్ణ బాధ్యతను అంగీకరించగల పెద్దవారు మనకు ఎంత అవసరమైయున్నారో!

## తప్పిపోయినప్పుడు నిజమైన పెద్దవారు విరమించుకోరు

## (2 సమూ. 24:18, 19; 1 దినవృ. 21:18, 19)

నాల్గవ సత్యం మొదటి మూడింటితో జతకూడుతుంది: తప్పిపోయినప్పుడు పెద్దవారు విరమించుకోరు.

ఒక క్షణంసేపు, వృద్ధుడైన రాజుయొక్క స్థలంలో నిన్ను నీవు పెట్టుకొని, నీవు ఎలా ఫీలయ్యేవాడవో ఆలోచించి చూడు. నీ జీవిత కాలమంతా దేవుని సేవించ కృషి చేశావ్. ఒకసారి మహా ఘోరమైన పాపం చేసి అట్టడుగునకు పోయావ్. అయితే అప్పటినుండి, ఏమి కావాలని దేవుడు కోరాడో, అన్ని విషయాల్లో అలాగే ఉండాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నావ్. ఇప్పుడు మరో పెద్ద తప్పు చేశావ్. దానికి ఫలితంగా నీ జనులు డెబ్బైవేల మంది చనిపోయారు. తల్లులు తండ్రులు, భార్యలు పిల్లలు విలపిస్తున్నారు. డెబ్బైవేల సమాధులు త్రవ్వబడ్డాయి. దేశం యావత్తు విలపిస్తుంది. విరమించుకొనడానికి నీవు సిద్ధపడతావా? "ఏమి లాభం?" అని నీవు అనుకుంటావా? నేను పనికిరాను, పాపం చేసికొంటూనే పోతున్నా. వదులుకుంటేనే మంచిది" అని నీవు తలంచుతావా?

అనుభవజ్ఞుడు కానివాడు చేసే పని అది. వారు తప్పిపోయినప్పుడు విరమించు కుంటారు.

అనుభవజ్ఞుల సంగతి వేరే. నిజమైన పెద్దవారు విరమించుకోరు. దావీదును గమనించు; అతడు దేవుని యెదుట నిలిచి తన ప్రజల కొరకు విజ్ఞాపనము చేస్తున్నాడు. అప్పుడు దేవుడు దావీదునొద్దకు యిలా వర్తమానం పంపాడు. "ఆ దినమున గాదు దావీదునొద్దకు వచ్చి – నీవు పోయి యెబూసీయుడైన అరౌనాయొక్క కళ్లములో యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టించుమని అతనితో" చెప్పెను (2 సమూ. 24:18). "లాభమేముంది? మరలా నేను పాపం చేస్తానని ఎరిగియుండి దీన్ని దిద్దుకునేది ఎందుకులే" అని దావీదు అనలేదు. గాని, "దావీదు గాదుచేత యెహోవా యిచ్చిన ఆజ్ఞచొప్పున పోయెను" (2 సమూ. 24:19). దేవుని కనికరం విస్తరింపజేయబడింది. దావీదు లోబడ్డాడు! దావీదు తప్పిపోయినప్పుడు సయితం దేవుని చిత్తము, ఆయన మార్గంలో తన జీవితాన్ని నిలుపుకొనడానికి తీర్మానం చేసికొన్నాడు.

## పెద్దవారు యింకను దేవునికి లోబడవలసినవారై యున్నారు

## (2 సమూ. 24:20-25; 1 దినవృ. 21:20-26)

పెద్దవారు యింకను దేవునికి లోబడవలసినవారై యున్నారనే సత్యానికి యిది మనలను తీసికొని వస్తుంది.

అధికారానికి సాధారణమైన గౌరవం లేని దినాల్లో మనం జీవిస్తున్నాం. మీలో ఎక్కువ మంది ఈ ప్రతిపాదనతో ఏకీభవిస్తారు. ఏదియెలాగున్నా, అధికారానికి లోబడడం అవసరమని మనం అన్నప్పుడు సహజంగా నవ యువకులను మనం మనస్సులో ఉంచుకొని మాట్లాడతాం. "మీరు మీ తల్లిదండ్రుల అధికారానికి లోబడాలి. మీ

ఉపాధ్యాయుల యొక్క అధికారానికి లోబడాలి. మీరు చట్టం యొక్క అధికారానికి లోబడాలి” అని వారికి చెప్పుతాం. ఆ ప్రతిపాదనలలో ప్రతిదీ రైటే. అయితే దీనిని ఆలోచించు: అధికారానికి గౌరవం లేనిదానికి కారకులు నవయువకులు కారు – పెద్దవారే. దానికంతటికి మూలం దేవుని అధికారానికి గౌరవం లేకపోవడమే.

నిజంగా పెద్దవారు అయినవారు వారి హుందాతనం, జీవితం యొక్క లక్ష్యం – దేవుని యెదుట తమ్మును తాము తగ్గించుకొని, ఆయన చిత్తాన్ని జరిగించ త్వరపడడంలో ఉందని నేర్చుకుంటారు.

యెబూసీయుడగు అరౌనా కళ్లములో బలియర్పించుమని దేవుడు దావీదుకు ఆజ్ఞాపించాడు. నాశనం చేసిన దేవదూతను దేవుడు నిలిపిన స్థలం అదే. పొట్టు దుమ్ము తూర్పారపట్టేలా గాలివచ్చే వసతిగల ఊరివెలుపల ఎత్తయిన స్థలంలో కళ్లాలు ఉంటాయి. ఈ ప్రత్యేకమైన కళ్లము మోరీయా కొండపై ఉంది. అది యెరూషలేమునకు ఈశాన్య దిశగా ఉంది. (అది అప్పటికి యింకా పట్టణంలోనికి చేర్చబడలేదు). అబ్రాహాము తన కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించడానికి తీసికొనిపోయిన స్థలం అదే. సొలొమోను దేవాలయాన్ని కట్టిన స్థలం కూడా అదే!

అరౌనా అనే యితడెవరో మనకు సరిగా తెలియదు. అతడు యెబూసీయుడుగాని, లేక ఏదోయొక వంశపు రాజుగాని అయ్యుండవచ్చు (2 సమూ. 24:23). అయితే అతడు యూదా మతానికి మారినవాడైయున్నట్టున్నాడు. ఏమైనా సరే, అతడు కనాను దేశంలో ఉండ సమ్మతింపబడ్డాడు. అంతేగాక, కొంత ఆస్తిని తనకొరకు ఉంచుకున్నవాడై నట్టుగా చూస్తాం.

ఈ బలిని చేయుమని దేవుడు దావీదునకు వర్తమానం పంపినప్పుడు, ఏ విధంగాను వెనుకంజవేయలేదు. సూచింపబడిన స్థలానికి దావీదు వెంటనే బయలుదేరాడు. విధేయత అంటే అదే.

1 దినవృ. 21:10 అరౌనా (ఓర్నాను) “గోధుమల కళ్లం నూర్చుకున్నట్టు” చెప్పబడింది. అప్పుడు దావీదు అతని యొద్దకు వస్తాడు.

> అరౌనా రాజును అతని సేవకులును తన దాపునకు వచ్చుట చూచి బయలుదేరి రాజునకు సాష్టాంగ నమస్కారముచేసి – నా యేలినవాడవును రాజువునగు నీవు నీ దాసుడనైన నా యొద్దకు వచ్చిన నిమిత్తమేమని అడుగగా, దావీదు – ఈ తెగులు మనుష్యులకు తగలకుండ నిలిచిపోవునట్లు యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టించుటకై నీ యొద్ద ఈ కళ్లమును కొనవలెనని వచ్చితినని. అందుకు అరౌనా – నా యేలినవాడవగు నీవు చూచి యేది నీకు అనుకూలమో దాని తీసికొని బలి అర్పించుము; చిత్తగించుము, దహనబలికి ఎడ్లున్నవి, నూర్చుకళ్లు సామానులు కట్టెలుగా అక్కరకు వచ్చును. రాజా, యివన్నియు అరౌనా అను నేను రాజునకు ఇచ్చుచున్నాను (2 సమూ. 24:20-23ఎ).

అరౌనాకు అది బహు ఉల్లాసంతో కూడిన సమయమైయుండవచ్చు. దానికొన సమాంతరాన్ని ఆలోచించడానికి ప్రయత్నిస్తాను. మధ్యరాత్రి నా తలుపును తట్టారు. తలుపు ద్వారమునొద్ద ఆఫీసర్లుగా కనబడే ఆరుగురు మనుష్యులున్నారు. కారులో ఒకవ్యక్తి

ఉన్నాడు. కారులోనుండి పొగలు వస్తున్నాయి. కారులో బాగా ఎరిగిన ముఖం కన్పించింది. వచ్చినవారిలో ఒకడన్నాడు: "దేశపు ప్రధాని రహస్యమైన పనిమీద ఈ ఏరియాలో ఉన్నాడు. ఆయన కారు ట్రబుల్ యిచ్చింది. ఆయనకు వెంటనే ప్రయాణ సౌకర్యం కల్పించాలి" అంటే వెంటనే నేను రెండు మూడు గుటకలు వేస్తాను. అప్పుడు "ఇదిగో నా కారు, నా క్రెడిట్ కార్డు" అని అంటాను.

వెంటనే నాకు రెండో తలంపు వచ్చింది. "రాయల్‌టీ"కి ప్రధాని సరియైన సమం కాదు. నీ సొంత ఉదాహరణను నీవే తయారు చేసికో. నీవు బహుగా అభిమానించే వ్యక్తి వచ్చి నిన్ను ఏదైనా అడిగితే దానికి నీ రియాక్షన్ ఎలాగుంటుందో ఊహించు.

"నీ యెదుట కన్పించేది ఏదైనా నీవు తీసికోవచ్చు.[9] నూర్చే ఎద్దులు బలిపశువులుగా పనికి వస్తాయి. యెద్దుల కాడి[10] మిగిలిన కొయ్య సామాన్లు కట్టెలకు పనికి వస్తాయి." అని అరౌనా అన్నట్టుంది.

> రాజు – నేను ఆలాగు తీసికొనను, వెల యిచ్చి నీయొద్ద కొందును, వెల యియ్యక నేను తీసికొనిన దానిని నా దేవుడైన యెహోవాకు దహన బలిగా అర్పించనని అరౌనాతో చెప్పి ఆ కళ్లమును ఎడ్లను ఏబది తులముల వెండికి కొనెను (2 సమూ. 24:24).

నీవు లేఖన భాగాన్ని యింతకు ముందు గుర్తు పెట్టుకొనకపోయినట్టయితే, నీవు గుర్తు పెట్టుకోగోరతావు. అరౌనా యిస్తానన్నది యిచ్చియున్నట్టయితే, అది అరౌనా చేసిన బలియై ఉంటుంది. దావీదుదైయుండదు! దావీదు యొక్క ప్రతిపాదన నిజంగా ఎదిగినవాని ప్రతిపాదనయైయుంది. ఏమీ ఖరీదు కాని మతం దేనికి పనికిరానిదై ఉంటుంది. ఎదిగినవారు ఉచితమైన స్వారి కోరరు, తమ వంతు తాము జరిగిస్తారు.

దేవునికి బలియర్పించడంలో లోకమందు మూడు తత్వాలున్నాయి: లక్ష్యం లేనివాడు యిలా అంటాడు: "నా దేవుడైన యెహోవాకు ... నేను అర్పించను." "నాకు ఖర్చయ్యేదానిని ... నా దేవుడైన యెహోవాకు నేను సమర్పించను" అని అనుభవజ్ఞుడుకాని వ్యక్తి అంటాడు. "అనుభవజ్ఞుడైన వ్యక్తియైతే, నాకు ఏమీ ఖర్చుగాని దానిని ... నేను నా దేవుడైన యెహోవాకు సమర్పించాను" అని అంటాడు.

ఇంతకు నిజమైన విధేయత అంటే ఏమో నిజంగా ఎదిగిన వారికే అర్థమౌతుంది. వారే ఎరుగుతారు. తాము విధేయులయ్యే దేవునికి సమయం, జలం, ప్రయాస సమర్పించాలని వారికి తెలుసు. తమ దైనిక కార్యక్రమంలో తాము విధేయులమయ్యే దేవునికి మార్పు అవసరమని వారికి తెలుసు. పైగా సంవత్సరాలు జరిగేకొలది తాము విధేయులయ్యే దేవునికి ఎక్కువ కావాలేగాని, తక్కువకాదు. ప్రభుత్వ, ప్రభుత్వేతర ఉద్యోగంనుండి పని విరమణ చేసికోవచ్చుగాని దేవుని సేవలోనుండి పని విరమణ చేసికొనే వీలు ఉండదని వారికి తెలుసు.

నిజంగా ఎదిగినవారికి దేవునికి విధేయులవ్వడం అంటే ఏమో తెలుసు.

## ఎదిగినవారు ఆరాధనను అర్థం చేసికొని పెంపారతారు

## (2 సమూ. 24:25; 1 దినవృ. 21:26-29)

ఎదిగినవారికి ఆరాధన అంటే ఏమో తెలుస్తుంది – సంవత్సరాలు జరిగేకొలది దానిని వారు పెంపారజేసికొంటారు.

దేవుని సముఖంలో ముసలి రాజును 2 సమూ. 24:25 రమ్యమైన రూపంలో చిత్రిస్తుంది: "అక్కడ దావీదు యెహోవా నామమున ఒక బలిపీఠము కట్టించి దహన బలులను సమాధాన బలులను అర్పించెను; యెహోవా దేశముకొరకు చేయబడిన విజ్ఞాపనలను ఆలకింపగా ఆ తెగులు ఆగి ఇశ్రాయేలీయులను విడిచి పోయెను" తెగులు నిలిచిపోవునట్టుగా దావీదు మొదట దహన బలులను అర్పించాడు. తరువాత సమాధాన బలిని (లేక సహవాసపు బలిని) దేవునికి "కృతజ్ఞత" చెప్పడానికి అర్పించాడు.

1 దినవృ. 21, దాని తరువాత వచ్చే అధ్యాయాలు దీని పర్యవసానాన్ని గూర్చి తెలిపాయి. దేవుని యొద్దనుండి అగ్ని దిగి బలియర్పణమీదికి వచ్చింది; నశింపజేయు యెహోవా దూత కత్తిని తన వరలో పెట్టుకొంది; ఆ ప్రాంతాన్ని దేవాలయ స్థలంగా కోరుకొనబడింది.[11] అయితే ప్రస్తుతానికి, ఒకే ఒక సత్యాన్ని చూద్దాం. ఎదిగినవారు దేవుని ఆరాధించేవారి అవసరత లేక వాంఛకు అతీతులైయుండరు.

అప్పుడప్పుడు, "నేను ఎప్పుడు పెద్దవాడనౌతానో అప్పుడు నేను మా అమ్మా నాన్న చెప్పుచేతులలోనుండి బయటపడతాను" అని తలంచవచ్చు. "వారానికి ముమ్మారు సంఘ కూడికలకు వెళ్లే అవసరత అంతమౌతుంది. ఎవరికైనా వారానికి ఒక్కసారి సరిపోతుంది." ఈలాటి ఆలోచనలు నీకు ఎన్నడూ రాలేదా? ఎప్పుడైన నీకు అలాటి ఆలోచనలు వస్తే, నీ చుట్టు ఎదిగినవారు ప్రభువుతో సన్నిహితంగా నడుస్తున్నవారిని చూడు. ఆరాధనకు హాజరు కమ్మని వారికి ఎవరూ చెప్పరు. ఆరాధన అంటే వారికి ఎంతో ప్రశస్తమయ్యింది – అనుదినం వారికి అది ఎంతో ప్రశస్తంగా ఎదుగుతూ ఉంటుంది.

## ముగింపు

ఏమి చేయ బూనుకున్నామో అది మనం జరిగించామని నిరీక్షిస్తున్నాను:

1. పాత నిబంధన మనకు "బోధ కలుగు నిమిత్తం" ఉపయోగించాలి.

2. "విడువక" సహించాలి కాని విడిచిపెట్ట కూడదని పాత నిబంధన కోరుతుంది.

3. పాత నిబంధన మనలను "ప్రోత్సహించడానికి" ఆదరణ కలిగించడానికి నీ పాపం ఏమైయున్నా సరే, నీవు మారుమనస్సు పొంది దేవుని చిత్తాన్ని జరిగించితే, అది క్షమించబడుతుంది.

4. పాత నిబంధన మన "నిరీక్షణను" కట్టడానికి. నీవు పరిపూర్ణుడవు కాకపోయినా, దేవుని హృదయానుసారుడవుగా, (స్త్రీవైనా, బాలుడవైనా, బాలికవైనా) నీవు కాగలవు. నీ హృదయం దేవుని మీద ఆనుకొనియుంటే, పరలోకపు నిరీక్షణ నీదే!

పెద్దవారికి లేక ఎదిగిన వారికి మన కథ యిదే. "ఒకానొకప్పుడు, అనేదానితో ఆరంభమైనది," "ఆ తరువాత ఎల్లప్పుడు సంతోషంగా జీవించారు" అనేదానితో

ముగించబడాలి. దేవుడు దావీదును క్షమించినందున అతనికి సంతోషకరమైన అంతమే లభించింది. దేవుడు కోరినట్టిదిగా నీ జీవితం ఉండగలిగితే, దానికి కూడా సూఖాంతమే ఉంటుంది.

---

సూచనలు

[1]భక్తి పూర్ణుడు కాని యోవాబుకు సహితం అది పాపంగానే తోచింది (1 దినవృ. 21:3). అంటే, దావీదు బుర్రలో హెచ్చరిక గంటలు మ్రోగియుండవలసియుండేది – అయితే అలా జరుగలేదు. వాస్తవానికి యోవాబు యొక్క ఆక్షేపణ ఏమే తేటగా లేదు. "యోవాబు సరియైన స్థానంలో ఉన్నాడు, అయితే తప్పు హేతువుల కొరకు" అని అన్న జాన్‌విల్స్ రైటు కావచ్చు. (మొదటి, రెండవ సమూయేలు [అబిలిన్, టెక్స్.: ACU Press, 1987], 411, 412. [2]1 సమూ. 30:10తో పోల్చుము. [3]"తాను తన సొంత హక్కును బట్టి గొప్పవాడనని సాతాను గుస గుసకు (దావీదు) చెవియొగ్గాడు" (L. Allen, *The Communicator's Commentary: 1, 2 Chronicles* [Waco. Tex.: Word Books, 1987], 140). [4]1 దినవృ. 21:6. [5]NKJVలో "దావీదు హృదయము అతనికి తీర్పు తీర్చింది" అని ఉంది. [6]1 సమూ. 22:5. [7]1 దినవృ. 29:29; 2 దినవృ. 29:25. [8]ఈ కథ ఎప్పుడు జరిగిందో మనకు తెలియదు గనుక, "వారిపై యెహోవా కోపము రగులుకొనడానికి" జనులు ఏమి జరిగించారో మనం ఎరుగలేం. అబ్షాలోము తిరుగుబాటుతో వారు సహకరించియుండడమై ఉండవచ్చు. లేక దాఖలు చేయబడిన ఒక జాతీయ తప్పు అయ్యుండవచ్చు. [9]లావాదేవీలు జరగడానికి – ఆరంభం కావడానికి యిది మామాలు పద్ధతి. అరౌనా ఏ విధమైన (నష్ట పరిహారం) వేతనము లేక బహుమానం ఎదురు చూడడని దీని భావం కానవసరం లేదు. [10]నూర్చెడి స్లెడ్జికి బలమైన కొయ్యకు ఇనుప కొనలు క్రింది భాగంలో ఉంటాయట.

[11]గమనిక 1 దినవృ. 22:1; 2 దినవృ. 3:1.